www.bhadradrinews.com
# భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily | ఆదివారం 23,ఆగస్టు, 2026

## పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన
# మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఏఈఆర్‌ఓలు పోలింగ్ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలి.
- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి.
- బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి.
- పాలంపేట, చల్వాయి పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్






భద్రాద్రి న్యూస్ ములుగు : ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సహాయ ఎన్నికల నమోదు అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించేందుకు తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా భారత ఎన్నికల సంఘం ..

2వ పేజీలో...

## 25న దివ్యాంగుల ఆటల పోటీలు...

**-మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు వెల్లడి**



5లో

భద్రాద్రి న్యూస్ భద్రాచలం భద్రాచలం మండల పరిధిలోని దివ్యాంగుల ఏ వయసు ఐదు నుంచి 18 సంవత్సరాల పిల్లలకు మంగళవారం నాడు స్థానిక జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో ఆటలు పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి బెక్కంటి శ్రీనివాసరావు తెలిపారు. 5 నుండి 14 సంవత్సరాలు గల పిల్లలకు జిగ్ జాగ్ రన్నింగ్, మ్యూజికల్ చైర్, కప్ప గంతులు,,బాతు నడక , లెమన్ అండ్ స్పూన్ రేస్, 50 మీటర్ల పరుగు పందెం.

## దళారులను నమ్మి మోసపోవద్దు




4లో

**అంగన్వాడీ టీచర్లు, సహాయకుల ఎంపిక ప్రక్రియ పారదర్శకం: జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా**

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 22 (భద్రాద్రిన్యూస్ ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టుల భర్తీకి చేపట్టిన ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఎటువంటి దళారులను నమ్మి మోసపోవద్దని ఆమె సూచించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, తమకు పరిచయాలు ఉన్నాయని చెప్పే వ్యక్తులను దళారులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని హెచ్చరించారు. అంగన్వాడీ టీచర్లు, సహాయకుల ఎంపిక ప్రక్రియకు జిల్లా కలెక్టర్ గారు చైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశించిన అర్హతలు, రిజర్వేషన్ నిబంధనలు మరియు మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందని ..

భద్రాద్రి న్యూస్
ఆదివారం 23,ఆగస్టు, 2026

# పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలి





కార్యదర్శి నవీన్ కుమార్, శనివారం ములుగు జిల్లాలో పర్యటించారు. జిల్లా పర్యటనలో భాగంగా ముందుగా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను నవీన్ కుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిస్థితి, ఓటర్లకు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, బీఎల్ఓల పనితీరు తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులతో మాట్లాడి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో చేపడుతున్న క్షేత్రస్థాయి కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చల్వాయి గ్రామ ప్రజలతో కూడా ఆయన ప్రత్యక్షంగా మాట్లాడారు. ఓటర్ల జాబితాలో పేర్లు, వివరాల పరిశీలన, మార్పులు, చేర్పులు, అభ్యంతరాలకు సంబంధించిన అంశాలపై క్షేత్రస్థాయి పరిస్థితిని తెలుసుకున్నారు. బీఎల్ఓలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని నవీన్ కుమార్ స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు, లోటుపాట్లు ఉంటే ముందుగానే గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఏఈఆర్ఓలు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలని, కేవలం కార్యాలయ స్థాయి సమీక్షలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో బీఎల్ఓల పనితీరు, ఓటర్లకు అందుతున్న సేవలు, పోలింగ్ కేంద్రాల పరిస్థితిని స్వయంగా పరిశీలించాలని సూచించారు.

అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నవీన్ కుమార్, కార్యదర్శి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ--2026 పురోగతిపై ఏఈఆర్ఓలు, సంబంధిత ఎన్నికల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతో పాటు, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, డూప్లికేట్‌గా నమోదైన వారి వివరాలను ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు.

109--ములుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 308 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అధికారులు సమీక్షలో వివరించారు. ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం 2,09,128 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,01,964 మంది పురుషులు, 1,07,143 మంది మహిళలు, 21 మంది ఇతరులు ఉన్నట్లు తెలిపారు.

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో 11,308 నో మ్యాపింగ్ కేసులు, 30,326 అనామలీస్ కేసులు కలిపి మొత్తం 41,634 కేసులు ఉన్నాయని అధికారులు వివరించారు. వీటిపై విచారణ నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

నో మ్యాపింగ్, అనామలీస్ కేసులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి కేసులో వాస్తవ పరిస్థితిని నిర్ధారించిన అనంతరమే నిర్ణయం తీసుకోవాలని నవీన్ కుమార్ సూచించారు. ఏఈఆర్ఓలు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ అంశాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

బీఎల్ఓలు తమ పరిధిలోని ప్రతి ఓటరుకు అందుబాటులో ఉండాలని, ఓటర్ల జాబితాలో వివరాలకు సంబంధించి ప్రజలకు అవసరమైన సమాచారం, సహకారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత ఏఈఆర్ఓలు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి దశను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని, ఓటర్ల జాబితా స్వచ్ఛత, ఖచ్చితత్వాన్ని నిర్ధారించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ కృష్ణవేణి, 10 మండలాల తహసీల్దార్లు, ఎలక్షన్ సెల్ పర్యవేక్షకులు సలీం, డిటి నితీష్ కుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బూర్గంపాడు అభివృద్ధిలో మరో ముందడుగు..

## –రహదారి ఇరువైపులా చెట్ల తొలగింపు

### వాహనదారుల ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు సర్పంచ్ మందా నాగరాజు చర్యలు




**భద్రాద్రి న్యూస్ బూర్గంపాడు, ఆగస్టు 22:**

బూర్గంపాడు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా సర్పంచ్ మందా నాగరాజు మరో కీలక చర్య చేపట్టారు. బూర్గంపాడు--లక్ష్మీపురం ప్రధాన దారిలో రహదారికి ఇరువైపులా భారీగా పెరిగిన చెట్ల కొమ్మలు, పొదల కారణంగా వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వాటిని తొలగించే పనులను చేపట్టారు.

రహదారికి ఇరువైపులా చెట్లు విపరీతంగా పెరగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పాటు, ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు సర్పంచ్ నాగరాజు ప్రత్యేకంగా చర్యలు తీసుకుని జేసీబీ సహాయంతో చెట్లు, పొదలను తొలగించే పనులను పర్యవేక్షించారు.

ఈ పనుల్లో 14వ వార్డు మెంబర్ ఆకుల ఈరమ్మ కూడా పాల్గొని సహకరించారు. రహదారి విస్తీర్ణం స్పష్టంగా కనిపించేలా చెట్లను తొలగించడంతో వాహనదారులకు ప్రయాణం మరింత సౌకర్యవంతంగా, సురక్షితంగా మారనుంది.

ప్రజల సమస్యలను గుర్తించి, గ్రామ అభివృద్ధిలో భాగంగా తక్షణమే స్పందిస్తూ పనులు చేపడుతున్న సర్పంచ్ మందా నాగరాజుకు బూర్గంపాడు ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ నాగరాజు పేర్కొన్నారు.

# జీవో 97ను తక్షణమే రద్దు చేయాలి

### విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే ఊరుకోం.. కాంగ్రెస్ ప్రభుత్వం తుగ్లక్ నిర్ణయాలు మానుకోవాలి

### జీవో 97పై బీఆర్ఎస్ యువజన విభాగం భగ్గుమన్నది.. చర్లలో నిరసన, తహసీల్దార్‌కు వినతిపత్రం



**చర్ల, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్):**

విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే జీవో నంబర్ 97ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చర్ల మండల బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం తీవ్ర నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకోవడం సరికాదని బీఆర్ఎస్ యువజన నాయకులు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపు మేరకు, నియోజకవర్గ ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, మాజీ ఇన్‌చార్జి మానే రామకృష్ణ, మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, నియోజకవర్గ యువజన నాయకుడు కాకి అనిల్ సూచనలతో ఈ ఆందోళన చేపట్టారు. మండల యువజన విభాగం అధ్యక్షుడు అంబోజి సతీష్, కార్యదర్శి కుప్పల నిరంజన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన నాయకులు మాట్లాడుతూ.. జీవో నంబర్ 97 ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, ఐటీఐలు, అప్రెంటిస్ శిక్షణా కేంద్రాలను 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' (×ూఖ) పరిధిలోకి, అలాగే కొత్తగా ఏర్పాటు చేసిన 'శక్తి' శాఖ పరిధిలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ మార్పుల వల్ల సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

పాలిటెక్నిక్ విద్య పూర్తిచేసిన విద్యార్థులు జుజజు ద్వారా బీటెక్ రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందే లాటరల్ ఎంట్రీ విధానం కొనసాగుతుందా? లేదా? అనే సందేహాలు విద్యార్థుల్లో నెలకొన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండానే విద్యా వ్యవస్థలో మార్పులు చేయడం వల్ల విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని విమర్శించారు.

స్కిల్ యూనివర్సిటీ పబ్లిక్--ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో కొనసాగితే భవిష్యత్తులో ఫీజుల భారం పెరిగే ప్రమాదం ఉందని, దాని ప్రభావం ప్రధానంగా పేద, మధ్యతరగతి విద్యార్థులపై పడుతుందని నాయకులు హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విషయంలోనూ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

సాంకేతిక విద్యను కేవలం 'స్కిల్' పేరుతో కార్మిక శక్తిని తయారు చేసే కేంద్రాలుగా మార్చే ప్రయత్నాలను సహించేది లేదని బీఆర్ఎస్ యువజన నాయకులు ఘాటుగా వ్యాఖ్యానించారు. విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు ఉన్నత విద్యకు విస్తృత అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వం.. వారి భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే నిర్ణయాలు తీసుకోవడం దురదృష్టకరమన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను దెబ్బతీసే జీవో 97ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్‌పై స్పందించకపోతే విద్యార్థులను కలుపుకుని ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడకుండా ప్రభుత్వం తక్షణమే పునరాలోచన చేసి జీవో 97ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, ఆర్. కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవి, పాకలపాటి సత్యనారాయణరాజు, బొజ్జ ప్రణయ్, పంజా రాజు, మామిడి రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంబత్తిని రాంబాబు, ఉపసర్పంచ్ ఎడ్ల రామదాసు, బీసీ సెల్ అధ్యక్షుడు గోరెంట్ల వెంకటేశ్వర్లు, తడికల చంద్రశేఖర్, యువజన నాయకులు సృజన్, ప్రేమ్, కృష్ణంరాజు, వంశీ, సాగర్, నితీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం



**భద్రాద్రి న్యూస్ బూర్గంపాడు:**
బూర్గంపహడ్ మండలం ప్రభుత్వ ఆసుపత్రిలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని ఉప సర్పంచ్ గుండె వెంకన్న గారు పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రతను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి భోజనం గురించి ఆరా తీశారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ గుర్రం ప్రసాద్ గారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న ఆహారం నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ ఉండదని, రోగులకు నాణ్యమైన, వైద్యం, పౌష్టికాహారం అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు నిమ్మల హరీష్,ఉపసర్పంచ్ గుండె వెంకన్న గారు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ నూర్ బాషా దుదేకుల సంఘం సభ్యులు



**పాల్వంచ ,ఆగస్టు 22( భద్రాద్రిన్యూస్ ):**
తెలంగాణ నూర్ బాషా దుదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు షేక్ ఫకీర్ తమ్ముడు షేక్ వల్లి కుమారుడు రహీం తో పాల్వంచ వాస్తవ్యులు షేక్ కాసిం కుమార్తె షేక్ కరిష్మాతో వివాహము శనివారం జరిగింది . ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మరియు రాష్ట్ర జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ జనాబ్ సయ్యద్ భాషా , రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ సకీనాబి , ఖమ్మం జిల్లా అధ్యక్షులు షేక్ రహీం పాషా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం , రాష్ట్ర సాంస్కృతిక శాఖ రాష్ట్ర అధ్యక్షులు షేక్ భాషా , జూనియర్ గద్దర్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సిద్దు భాష ,ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ ఫరిద్ , మహబూబాబాద్ జిల్లా నర్సంపేట సీనియర్ నాయకులు షేక్ మహబూఅలి , వివిధ జిల్లాల దూదేకుల సంఘ జేఏసీ నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## పాడైన రహదారికి మరో ప్రాణం బలి

**రోడ్డు సరిగా లేక వాహనం స్కిడ్.. వ్యక్తి మృతి**

**రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికుల డిమాండ్**

**దుమ్ముగూడెం, భద్రాద్రి న్యూస్ ఆగస్టు 22**



దుమ్ముగూడెం మండలం నడికుడి గ్రామానికి చెందిన కురుసం వెంకట రమణ (40) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. లక్ష్మీనగరం నుంచి వెళ్తుండగా రాత్రి సుమారు 9 గంటల సమయంలో రహదారి సరిగా లేకపోవడంతో వాహనం స్కిడ్ అయి ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో వెంకట రమణ తలకు తీవ్ర గాయం కావడంతో మృతి చెందినట్లు తెలిసింది. పాడైన రహదారి కారణంగానే ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. గుంతలతో ఉన్న రహదారిపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రమాదాల ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రహదారిని సక్రమంగా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## జీవో నంబర్ 97 రద్దు చేయాలి -బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి సంఘాల నిరసన..



**చంద్రుగొండ/జూలూరుపాడు(భద్రాద్రి న్యూస్)ప్రతినిధి:**
పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగించేలా ఉన్న జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపు మేరకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి సెంటర్లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీవో నంబర్ 97ను రద్దు చేసి విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 97 రాష్ట్రంలోని పాలిటెక్నిక్( డిప్లమా) విద్య వ్యవస్థను మరియు కళాశాలలను యాంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రతిపాదించింది.ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తున్నారు వారి పోరాటనికి బిఆర్ఎస్ పార్టీ మద్దతు తెలుపుతూ నిరసన కార్యక్రమం నిర్వహించమని అన్నారు.స్కిల్ వర్సిటీలో పాలిటెక్నిక్ కాలేజీల విలీనానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన శక్తి స్కీమ్ తొలిగించాలని జీవో నెంబర్ 97ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేనియెడల విద్యార్థుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేసి కాంగ్రెస్ ప్రభుత్వనికి తగిన బుద్ధి చెపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారా వెంకటేశ్వరరావు (బాబు),గంపెన సొసైటీ వైస్ ఛైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, జిల్లా నాయకులు మేడ మోహన్ రావు,యువజన విభాగం నాయకులు మద్దుకూరు ఉప సర్పంచ్ శ్రవణ్, చంద్రుగొండ రెండో వార్డు నెంబర్ సూరా వెంకటేశ్వర్లు, భూపతి శ్రీను,యాకుబ్ పాల్గొన్నారు

## విద్యార్థుల విద్యాభివృద్ధికి కొల్లి ఫౌండేషన్ అండ





**ములకలపల్లి,ఆగస్టు 22 (భద్రాద్రిన్యూస్ ):-**
తిమ్మంపేట ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. సర్పంచ్ తుర్రం శ్రీనివాస్ రావు చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాగులను అందజేశారు.

విద్యార్థుల ప్రగతి, పాఠశాల నిర్వహణ, అభివృద్ధిని గతంలో పరిశీలించిన కొల్లి ఫౌండేషన్, గత సంవత్సరం పాఠశాలలో నిర్వహించిన చిత్రకళా పోటీల్లో విద్యార్థులకు బహుమతులు అందజేసింది. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయం అందిస్తామని అప్పట్లో ఇచ్చిన మాటను ఈ సందర్భంగా నిలబెట్టుకుంది.

ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల అవసరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శంకర్ కొల్లి ఫౌండేషన్ కోఆర్డినేటర్ రూప్లా నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ఫౌండేషన్ ఫౌండర్ శ్రీమతి కొల్లి కల్పనా చౌదరి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించిన ఆమె విద్యార్థులకు స్కూల్ బ్యాగులు అందించేందుకు సహకరించారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి. శంకర్ మాట్లాడుతూ, “కొల్లి కల్పనా చౌదరి స్ఫూర్తితో మరింత మంది దాతలు ముందుకు వచ్చి పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి సహకరించాలి. విద్యార్థులకు అందిస్తున్న ఈ సహాయం ఎంతో స్ఫూర్తిదాయకం” అని అన్నారు.

ఈ కార్యక్రమంలో కొల్లి ఫౌండేషన్ కోఆర్డినేటర్ రూప్లా నాయక్, గ్రామ కమిటీ ఛైర్మన్ డా. వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ సాయిబాబా, నాగరాజు, గోపి, ఆదిత్య, ఆకాష్, పురుషోత్తం, ఉపాధ్యాయులు నిర్మల, సురేష్, ప్రశాంత్, గ్రామ పెద్దలు పుప్పాల గోపి తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్లు, ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరి మారాలి

**పిఆర్ సి, డిఏ ప్రకటించాలి**

**ఈ నెల 27న ధర్నా ద్వారా సత్తా చాటుదాం**

**పెన్షనర్లకు ఎస్జిపిఏటి అధ్యక్షులు పరిశపుల్లయ్య పిలుపు**

**ఖమ్మం ప్రతినిధి , ఆగస్టు 22 (భద్రాద్రిన్యూస్ ):-**
పెన్షనర్లు, ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మారాలని, పెన్షనర్ల, ఉద్యోగుల సమస్యలు సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం(ఎస్జిపిఏటి)జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కృషిభవన్ లో ఎస్జిపిఏటి ముఖ్యకార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య అధ్యక్షతన జరిగింది. మూడు సంవత్సరాలు గడిచినా పెన్షనర్ల, ఉద్యోగుల ఉమ్మడి డిమాండ్ అయిన పిఆర్సి, ఆరు డిఏలు మంజూరు లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని, మూడు నెలలుగా హెల్త్ ప్రీమియం మినహాయిస్తున్న ప్రభుత్వం నగదు రహిత వైద్యం అమలు చేయటంలో నిర్లిప్తత వహిస్తున్నదని పెన్షనర్ల సంఘం నేత పరిశ పుల్లయ్య విమర్శించారు. 2024 మార్చి తరువాత ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లు అందరికి ఇప్పటివరకు పూర్తి స్థాయిలో బకాయిలు చెల్లించలేదని, సిపిఎస్ రద్దు పరచి ఒపిఎస్ అమలు చేయడం లో ప్రభుత్వ కపట ప్రేమ కనిపిస్తున్నదని, ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో పెన్షనర్ల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం నేత పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. పెన్షనర్ల, ఉద్యోగుల ఉమ్మడి సమస్యల పరిష్కారానికి ఈనెల 27న కలెక్టరేట్ వద్ద టిజిఇజేఏసి పిలుపు మేరకు జరిగే మహాధర్నా లో వందలాది పెన్షనర్లు పాల్గొని సత్తా చాటాలని ఎస్జిపిఏటి జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లను కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మేరిఏసుపాదం, జిల్లా నాయకులు రవికుమార్, తాడిఅంజలి, ఊడుగు వెంకటేశ్వర్లు, బెల్లంరాధాకృష్ణమూర్తి, కనపర్తి నాగప్రసాద్,ఊడుగు సుధాకర్ రావు,యండిహుస్సేన్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం బాల్ బ్యాట్మెంటన్ సబ్ జూనియర్స్ జట్టు ఎంపిక





**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 22( భద్రాద్రిన్యూస్ ):–**

ఉమ్మడి ఖమ్మం జిల్లా సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ బాలబాలిక జట్టులను ఎంపిక చేశామని కల్లూరు వ్యాయామ ఉపాధ్యాయులు పసుపులేటి వీరరాఘవయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కల్లూరు గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియం క్రీడా ప్రాంగణం నందు రెండు జిల్లాల పరిధిలో జరిగిన సబ్ జూనియర్ బాల బాలికల జిల్లా జట్ల ఎంపికల లో బాలికలు 40 మంది బాలురు 60 మంది పాల్గొన్నారని తెలిపారు. అత్యంత ప్రతిభ కనపరిచి న క్రీడాకారులను పది మంది బాలురను, పదిమంది బాలికలను ఎంపిక చేసామని, ఎంపిక అయినటువంటి క్రీడాకారులు ఈనెల 28, 29 ,30 తేదీలలో తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలు బి.హెచ్. ఈ ఎల్ హైదరాబాదు నందు నిర్వహించబడతాయని ఈ పోటీలలో ఖమ్మం జిల్లా జట్టు పాల్గొంటారని తెలిపారు . ఈ పోటీల నిర్వహణ బాధ్యతను ఖమ్మం జిల్లా బాల్ బ్యాట్మెంటన్ జనరల్ సెక్రటరీ బొంతు శ్రీనివాసరావు ,అధ్యక్షుడు వెజిల్ల సురేష్, కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఉ న్నం నాగేశ్వరరావు క్రీడల నిర్వహణ బాధ్యతల ను కల్లూరు మండల వ్యాయామ ఉపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు తోడ్పాటు నందించి పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఎంపికకు వచ్చినటువంటి క్రీడాకారులకు అబ్దుల్ రహీం ,మోటమర్రి ప్రభాకర్ ,సీనియర్ బాల్ బ్యాట్మెంటన్ క్రీడాకారులు సత్యం పేరున పిల్లలకు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శిక్షకులు పసుపులేటి వీర రాఘవయ్య ,తల్లపు రెడ్డి గౌతం, రజిని ,శ్రీదేవి ,పద్మ ,రమాకుమారి, వెంకటేశ్వర్ రావు సీనియర్ క్రీడాకారులు చెంగపొంగు సైదులు , జగదీష్ ,గోపి ,వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామ దర్శికులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**భద్రాచలం భద్రాద్రి న్యూస్ ఆగస్టు 22**

భద్రాచలం ఏరియా హాస్పిటల్లో పోస్టుమార్టం నిమిత్తం ఉంచిన నడికుడి గ్రామానికి చెందిన కురుసం వెంకటరమణ పార్థివదేహాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సందర్శించి నివాళు లర్పించారు. నిన్న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటరమణ గారు అక్కడికక్కడే మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ మనోధైర్యం కల్పించారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే గారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అన్నెం సత్యనారాయణమూర్తి (సత్యాలు) , తదితరులు పాల్గొన్నారు

# కన్నతల్లిని మాతృభూమిని ఎన్నటికి మరువవద్దు



**పెనుగొండ ఉపేంద్రరావు**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 22 (భద్రాద్రిన్యూస్ ):–**

ప్రతి విద్యార్థి తన జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని చేరుకున్నప్పటికీ తన కన్నతల్లిని తన పుట్టి పెరిగిన ఊరును ఎన్నటికీ మరువరాదని, తన ఊరును అభివృద్ధి చేసే విధంగా ప్రతి ఒక్క రు ఆలోచించాలని లయన్స్ జిల్లా క్యాబినెట్ జాయింట్ ట్రెజర్, గుట్ట బడి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ ప్రధాన కార్యదర్శి పెనుగొండ ఉపేంద్ర రావు అన్నారు. గొల్లెనపాడు ప్రాథమికోన్నత పాఠశాల నందు ప్రధాన ఉపాధ్యాయులు సి.హెచ్. తిరుమలయ్య అధ్యక్షతన, పాఠశాల ఉపాధ్యాయురాలు బండారు సరిత ప్రత్యేక చొరవతో జరిగిన కార్యక్రమంలో గ్రామ వాస్తవ్యులు పాఠశాల పూర్వ విద్యార్థి అయిన వెంపటి సత్య వర్ధన్ రావు నేడు అమెరికాలో స్థిరపడినప్పటికి తన స్వగ్రామం గురించి ఆలోచిస్తూ విద్యార్థులు భవిష్యత్తుకు తన సహాయ సహకారాలు అందించాలనే ఉద్దేశంతో 20 వేల రూపాయలు విలువ చేసే స్కూల్ బ్యాగ్స్ ను మరియు పాఠశాలలో స్కావెంజర్కు నిత్యవసర సరుకులు ను వారి శ్రీమతి స్రవంతి కుమార్తెలు రాగ వైష్ణవి,మేఘన గార్ల సహకారంతో వారి తల్లి రమాదేవి గారి ద్వారా స్వయంగా అందించడం చాలా అభినందనీయమని పిల్లలకు ఉపయోగపడే బ్యాగ్స్ ఇప్పించడం లో పాఠశాల ఉపాధ్యాయుని బండారు సరితను తీసుకున్న చొరవను కొనియాడినారు. అనంతరం జీవి మాల్ వారి సహకారంతో విద్యార్థిని విద్యార్థులకు బ్రౌజర్స్ పంపిణీ చేసి, లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు డయాబెటిక్ అవేర్నెస్ మరియు చైల్డ్ వుడ్ కాన్సర్ పై అవగాహన కల్పించి ఆయన పాల్గొని మాట్లాడినారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సామ్రాజ్యంమాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరాలని కోరినారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ లీలమ్మ పాఠశాల ఉపాధ్యాయులు ఎం చంద్రశేఖర్ జి రామకృష్ణ బండారు సరిత జి గృహలక్ష్మి, తల్లిదండ్రుల విద్యార్థిని విద్యార్థులు పాల్గొని సత్య వర్ధన్ కు వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేసినారు.



# తరం నుండి తరానికి అందాల్సిన అద్భుతమైన కళా నైపుణ్యం చేతి వృత్తి స్వర్ణకారులది

**వారిని ఆదరించండి ప్రోత్సహించండి**

**36వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ రావు**






**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 22( భద్రాద్రిన్యూస్ ):**

భక్తపోతన వీధి శ్రీ గోవిందమాంబ సమేత శ్రీశ్రీశ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణ మండపం లో స్తంభాద్రి ఖమ్మం నగర స్వర్ణకార సంఘం అధ్యక్షులు , ప్రధాన కార్యదర్శి , కోశాధికారి , నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 36వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్ రావు పాల్గొని నూతన కార్యవర్గాన్ని సన్మానించి మాట్లాడారు . స్వర్ణకారులంతా ఐక్యంగా ఉండి ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫలాలు పొందాలని ఆకాంక్షించారు . ఎలాంటి ఆధునిక యంత్రాలు లేని కాలంలోనూ దేవాలయాలకు అవసరమైన ధ్వజస్తంభాలు , కిరీటాలు , అద్భుతమైన నగిషీ నగలను చేతితో తయారు చేసిన ఘనత స్వర్ణకారులుదని అన్నారు . తరం నుండి తరానికి అందాల్సిన అద్భుతమైన కళా నైపుణ్యం స్వర్ణకాలు దగ్గర ఉందని కొనియాడారు . అలాంటి స్వర్ణకారుల నైపుణ్యాన్ని మనం ఆదరించి ప్రోత్సహించాలని అన్నారు . ఈ కార్యక్రమంలో స్తంభాద్రి ఖమ్మం నగర స్వర్ణకార సంఘం అధ్యక్షులు శ్రీ గౌరోజు వీర్భోగవసంతరాయులు (వసంత బాబు) , ప్రధాన కార్యదర్శి కోటగిరి నాగేశ్వరాచారి , కోశాధికారి ర్యాలీ బ్రహ్మజీ మరియు సంభాద్రి ఖమ్మం నగర స్వర్ణకార సంఘ పెద్దలు , బులియన్ మర్చంట్ పెద్దలు , రాష్ట్ర నాయకులు , జిల్లా నాయకులు , విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు , సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

# దళారులను నమ్మి మోసపోవద్దు

**మొదటి పేజీ తరువాయి**

స్పష్టం చేశారు. ఎవరికి ఉద్యోగం వస్తుందో ముందుగా ఎవరికీ తెలియదని, ఎంపిక పూర్తిగా నిబంధనల ప్రకారం జరుగుతుందని జిల్లా సంక్షేమాధికారి పేర్కొన్నారు. అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, దళారులను ఆశ్రయించకుండా అధికారిక ప్రక్రియపై మాత్రమే ఆధారపడాలని సూచించారు. వచ్చే వారంలో అంగన్వాడీ టీచర్లు, సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ముఖాముఖి (ఇంటర్వ్యూ) నిర్వహించే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన వివరాలను అధికారికంగా తెలియజేస్తామని జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా తెలిపారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన కడియం శ్రీహరి

**ధర్మసాగర్, ఆగస్టు 22 (ప్రభాతవార్త):**

ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్స్‌లో మండలంలోని ఉచిత రేషన్ బియ్యం లబ్ధిదారులకు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సన్నబియ్యం పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు. కార్డుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు డిజిటల్‌గా నమోదు చేయడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని అన్నారు.

లబ్ధిదారులు తమకు కేటాయించిన రేషన్ దుకాణాల డీలర్ల వద్ద స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బావు సింగ్, ఎంపీడీవో అనిల్ కుమార్, నాయబ్ తహసీల్దార్ సంతోష్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రపు రాజేంద్రప్రసాద్, మండల అధ్యక్షుడు పెసరు రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి న్యూస్
ఆదివారం 23,ఆగస్టు, 2026

# 25న దివ్యాంగుల ఆటల పోటీలు...

**మొదటి పేజీ తరువాయి**

15 నుండి 18 సంవత్సరాల పిల్లలకు 100 మీటర్ల పరుగు పందెం, నిదాన నడకల్లో పందెం, కుర్చీల ఆట, షాట్ పుట్ త్రో, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, హై జంప్, క్యారమ్స్ నిర్వహించి వారిలో విజేతకు ప్రథమ, ద్వితీయ బహుమతి ప్రధానము తోపాటు ప్రశంస పత్రం కూడా ఇవ్వబడును. ఈ కార్యక్రమానికి నిర్వాహకులుగా లిస్థానిక భవితా కేంద్రంలోని ఇంక్యుస్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (IERP) ఎస్ పద్మావతి, ఆర్ సుమలత వారు నిర్వహిస్తున్నట్టు బెక్కంటి తెలిపారు. కాబట్టి మండలంలోని సిడబ్ల్యూఎస్ చెందిన విద్యార్థులు అందరూ ఈ పోటీలలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ కార్మికులపై వేటు

**లబోదిబోమంటున్న కార్మికులు**




ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ కార్మికులపై వేటు పడింది శుక్రవారం రోజు రాత్రి పరకాల వరంగల్ టు డిపోకు సంబంధించిన 90 మంది ఔట్సోర్సింగ్ కార్మికులను తొలగిస్తూ ప్రతిపాదన విడుదల చేసింది దీనితో కార్మికులు సంవత్సర కాలంగా పనిచేస్తూ ఒకసారి గా తొలగించడంతో రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది . గత సంవత్సర కాలంగా ప్రతి నాలుగు నెలలకు ఒకసారి రెన్యువల్ చేస్తూ వచ్చిన ఆర్టీసీ జూన్ నెలలో కాంట్రాక్ట్ పూర్తి కావడంతో మళ్లీ డిసెంబర్ వరకు కాంట్రాక్టును పొడిగించారు కానీ ఉన్న ఫలానా కార్మికులను తొలగించడంతో లబోదిబోమంటున్నారు శనివారం రోజు ఉదయం హనుమకొండ బస్టాండ్ లోని ఆర్ఎం ఆఫీస్ తోపాటు బస్టాండు ప్రాంతంలో నిరసన తెలియజేశారు. దీని పై అధికారులు ఏ విధమైన హామీ ఇవ్వకపోవడంతో అవుట్సోర్సింగ్ కార్మికులు ధర్నాకు దిగి నిరసన తమకు న్యాయం చేయాలని కార్మికులు వాపోతున్నారు అవుట్సోర్సింగ్ సమయంలో ఏజెన్సీలో కాంట్రాక్టు పద్ధతిలో కార్మికులను నియమించుకొని వారి వద్ద పైసలు కూడా తీసుకున్నారని కార్మికులు తెలియజేశారు. దీని పై ఏజెన్సీలను కూడా నిలదీస్తామని కార్మికులు బస్టాండ్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో తెలియజేశారు తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు

# జనసైనికుల ఆధ్వర్యంలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

శనివారం రోజు జనసైనికులు ఆధ్వర్యంలో హనుమకొండ శ్రీ హర్ష కన్వెన్షన్ లో తెలంగాణలో 'సాధక్'లను సన్మానించడం, సీనియర్లను గౌరవించడం, పోటీ చేసిన అభ్యర్థులను సత్కరించడం, కొత్తవారిని ఆహ్వానించడం పార్లమెంటరీ సమావేశాల ప్రధాన అజెండా జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేస్తుంది వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో తాళ్లూరి రామ్, శ్రీ నేమూరి శంకర్ గౌడ్ తెలంగాణ రాష్ట్రంలో 'సాధక్'లను సన్మానించుకోవాలనే దృక్పదంతో, పోటీ చేసిన అభ్యర్థులను సత్కరించుకుంటూ, కొత్తవారిని పార్టీలోకి ఆహ్వానిస్తూ, సీనియర్లను గౌరవిస్తూ అందరూ ఐకమత్యంగా పనిచేసేలా ప్రోత్సహించడమే పార్లమెంటరీ సమావేశాల ప్రధాన అజెండా అని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ తాళ్ళూరి రామ్ స్పష్టం చేశారు. హన్మకొండ శ్రీహర్ష కన్వెన్షన్ వేదికపై శనివారం జరిగిన వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో తాళ్లూరి రామ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా జనసేన పోటీ చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జ్ శ్రీ నేమూరి శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులు ఐకమత్యంతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. సుదీర్ఘ కాలం నుండి పార్టీ కోసం పని చేస్తున్న వారిని గౌరవిస్తూ, కొత్తవారిని కలుపుకుంటూ ముందుకెళ్ళాలని అన్నారు. జనసేన పార్టీ ప్రచార కార్యదర్శి శ్రీ ఆర్.కె. సాగర్ మాట్లాడుతూ.. జనసేన పార్టీని చూస్తే ఇతర పార్టీలకు అప్పుడే భయం మొదలైందని, మున్ముందు అన్ని రాజకీయ పార్టీలకు దీటుగా జనసేన పార్టీ ఉంటుందని అన్నారు. కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో భాగంగా హన్మకొండ ఫాతిమా సెంటర్ నుండి శ్రీ హర్ష కన్వెన్షన్ వేదిక వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యలో అదాలత్ సర్కిల్ అమరవీరుల స్థూపం దగ్గర తెలంగాణ అమరవీరులకు నివాళి అర్పించారు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహంకు పూలమాల వేసి నివాళి అర్పించారు. వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో అత్యధిక సభ్యత్వాలు నమోదు చేసిన 'సాధక్'లను ప్రత్యేకంగా సన్మానించారు. జనసేన తరపున ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసిన వారిని సత్కరించారు. ఈ సందర్భంగా అనేకమంది యువత, మహిళలు, నాయకులు జనసేన పార్టీలో చేరారు. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ దుంపటి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు మాదిరెడ్డి దామోదర్ రెడ్డి, మచ్చ సుధాకర్, డాక్టర్ గడల శ్రీనివాస్, అల్లాడి తనీష్, సురేష్ రెడ్డి, ప్రేమ్ గాంధీ, హైందవి రెడ్డి, మీసాల శ్రీనివాస్ రావు, మిరియాల రామకృష్ణ, రవిష్, మంథని సంపత్, సంతోష్ నాయక్, ఆంజనేయులు, రాము యాదవ్, శ్రీధర్ శర్మ, వరంగల్ పార్లమెంట్ నాయకులు గాదె పృథ్వీ, కరాటే ప్రభాకర్, గోళ్ళ రాజేంద్రప్రసాద్, డాక్టర్ పద్మజా దేవి, అకుల శ్రీకాంత్, గడ్డం రాకేష్, బాలు గౌడ్, బైరీ వంశీ, ఆంజనేయులు గౌడ్, అనుదీప్, అభిలాష్, వెల్తూరి నగేష్, చక్రపాణి, శివకోటి ప్రశాంత్ రెడ్డి, బర్ల శివ సనత్, రామ్ ప్రసాద్, చింత రమేష్, వీర మహిళలు పద్మావతి, సౌమ్య, నాగమణి, షబాన, సునీత గౌడ్, మెడిద శోభ, జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

# ప్రజా పోరాటాలకు ప్రతిరూపం సురవరం సుధాకర్‌రెడ్డి

**ప్రజల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత కమ్యూనిస్టు నాయకుడు**

**చర్లలో ఘనంగా సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి**




**చర్ల, ఆగస్టు 22 (భద్రాద్రి న్యూస్):** ప్రజా సమస్యల పరిష్కారం కోసం జీవితాంతం పోరాడిన సీపీఐ అగ్రనేత, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయాలు నేటి తరానికి ఆదర్శమని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ అన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని చర్ల మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా అడ్డగర్ల తాతాజీ మాట్లాడుతూ.. సురవరం సుధాకర్‌రెడ్డి విలువలకు నిలువుటద్దంగా నిలిచిన మహోన్నత కమ్యూనిస్టు నాయకుడని కొనియాడారు. విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై పోరాటం ప్రారంభించిన ఆయన, అఖిల భారత విద్యార్థి సమాఖ్య (AISF) జాతీయ ప్రధాన కార్యదర్శిగా, జాతీయ అధ్యక్షుడిగా, అఖిల భారత యువజన సమాఖ్య (AIYF) జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు.
అనంతరం రెండు పర్యాయాలు పార్లమెంట్ సభ్యుడిగా, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు ఉద్యమ బలోపేతానికి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాడారని తాతాజీ అన్నారు. పదవుల కోసం కాకుండా ప్రజల కోసం జీవించిన నాయకుడిగా సురవరం సుధాకర్‌రెడ్డి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని ఆయన పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడం, సామాజిక న్యాయం కోసం పోరాడటం, పేదలు మరియు కార్మికుల హక్కులను కాపాడటం వంటి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కమ్యూనిస్టు కార్యకర్తపై ఉందన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయాలు, సిద్ధాంతాలు, విలువలను ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల హక్కుల కోసం నిరంతరం ఉద్యమించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చర్ల మండల సహాయ కార్యదర్శి కోటి ముత్యాలరావు, కోడిరెక్కల రాజారావు, మునిగల రామారావు, ఆంద్రూ వామనరావు, నరసింహారావు, మోడెం ఆదినారాయణ, దుర్గాప్రసాద్, సత్యనారాయణ, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఫౌండేషన్ విజ్ఞప్తి.. మంత్రి సీతక్క చొరవతో కాలనీకి సీసీ రోడ్లు

**- ప్రగళ్లపల్లి ఎస్సీ కాలనీకి రూ.25 లక్షలతో సీసీ రోడ్లు**
**- దశాబ్దాల రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం**
**- ప్రజల సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లిన డాక్టర్ పీర్ల కృష్ణబాబు**
**- కృష్ణబాబుకు సన్మానం.. మంత్రి సీతక్కకు కాలనీ ప్రజల కృతజ్ఞతలు**

**వెంకటాపురం–నూగూరు, భద్రాద్రి న్యూస్, ఆగస్టు 22:** ములుగు జిల్లా వాజేడు మండలం మొరుమూరు పంచాయతీ పరిధిలోని ప్రగళ్లపల్లి ఎస్సీ కాలనీలో దశాబ్దాలుగా నెలకొన్న అంతర్గత మట్టి రోడ్ల సమస్యకు పరిష్కారం లభించింది. వర్షాకాలంలో రోడ్లు బురదమయంగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సిమెంట్ రోడ్లు మంజూరు చేయించాలని ఎస్సీ కాలనీ ప్రజలు అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పీర్ల కృష్ణబాబును కోరారు.

ప్రజల సమస్యపై స్పందించిన డాక్టర్ పీర్ల కృష్ణబాబు వారి చిరకాల అవసరాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. ప్రగళ్లపల్లి ఎస్సీ కాలనీ ప్రజల చిరకాల అవసరాన్ని గుర్తించిన మంత్రి సీతక్క ప్రత్యేక గ్రాంట్ ద్వారా సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేశారు. సంబంధిత అధికారులకు సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేశారు.





దీంతో కాలనీ అంతర్గత రహదారుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక గ్రాంట్ ద్వారా రూ.25 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్లు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి చేయించడం ఎంతో అభినందనీయమని అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పీర్ల కృష్ణబాబు అన్నారు. ఈ అభివృద్ధి పనులతో కాలనీ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కలగడంతో పాటు వారి దైనందిన జీవనానికి ఎంతో ఉపయోగకరంగా మారిందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ప్రగళ్లపల్లి ఎస్సీ కాలనీ ప్రజలు శనివారం అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పీర్ల కృష్ణబాబును చిరు సన్మానం చేసి తమ ఆత్మీయతను చాటుకున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న మంత్రి సీతక్కకు, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన డాక్టర్ పీర్ల కృష్ణబాబుకు ఎస్సీ కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.
ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలని, వాజేడు మండలంలోని ప్రతి గ్రామం అభివృద్ధి పథంలో పయనించాలని డాక్టర్ పీర్ల కృష్ణబాబు ఆకాంక్షించారు. ప్రజల కోసం, ప్రజల అభివృద్ధి కోసం మంత్రి సీతక్క కొనసాగిస్తున్న సేవా ప్రస్థానం మరింత విజయవంతం కావాలని కోరుతూ ఆమెకు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.